క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీలో చేరిక



టీడీపీ కార్యకర్తలకు పార్టీ కండువా కప్పుతున్న ఎంపీ తలారి రంగయ్య

కంబదూరు: మండలంలోని నూతిమడుగు గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు బోయ చిన్న ఎర్రిస్వామి,బోయ తిరుమలయ్య,వెంకటేష్‌నాయక్,ఎర్రిస్వామి ఎంపీ తలారి రంగయ్య సమక్షంలో శుక్రవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి ఎంపీ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసే సంక్షేమ పథకాలకు ఆకర్షితులమై వైఎస్సార్‌సీపీలో చేరుతున్నట్లు వారు తెలిపారు. అనంతరం వైఎస్సార్‌సీపీ నాయకుడు, డీలర్ నరసింహులు కుమారుడి వివాహ వేడుకల్లో ఎంపీ పాల్గొని, నూతన వధూవరులను ఆశీర్వదించారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి

- ఆర్డీఓ డాక్టర్ రాణీ సుస్మిత



అవగాహన కల్పిస్తున్న ఆర్డీఓ రాణీసుస్మిత, చిత్రంలో డీఎస్పీ శ్రీనివాసులు

కళ్యాణదుర్గం: ట్రాన్స్‌జెండర్లు ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆర్డీఓ డాక్టర్ రాణీ సుస్మిత సూచించారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఓటు హక్కు వినియోగంపై ట్రాన్స్‌జెండర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ శ్రీనివాసులుతో కలిసి మాట్లాడారు. ఓటు హక్కు వినియోగంలో ఏమైనా అభ్యంతరాలుంటే అధికారులను సంప్రదించాలని ఆర్డీఓ సూచించారు. కార్యక్రమంలో ఎన్నికల డీటీ వెంకటేశులు, సీఐలు హరినాథ్, నాగరాజు, చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

కోడ్ ఉల్లంఘనులపై చర్యలు

కళ్యాణదుర్గం: ఎన్నికల నేపథ్యంలో ఎంసీసీ కోడ్ పకడ్బందీగా అమలు చేయాలని, కోడ్ ఉల్లంఘనులపై కఠిన చర్యలు తీసుకోవాలని రిటర్నింగ్ అధికారి డాక్టర్ రాణీ సుస్మిత ఆదేశించారు. శుక్రవారం ఆర్‌ఓ కార్యాలయంలో నోడల్ అధికారులతో ఎంసీసీ కోడ్‌పై సమావేశం నిర్వహించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నిబంధనలు పాటించాలన్నారు. ఎక్కడైనా నిబంధనలు ఉల్లంఘిస్తే అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎన్నికల నియామావళిలో భాగంగా ఇప్పటికే అన్ని రాజకీయ పార్టీలకు ఎంసీసీ కోడ్‌పై అవగాహన కల్పించామన్నారు. ప్రతి ఒక్కరూ నిబంధనలకు లోబడి ఎన్నికలు సజావుగా జరిగేలా సహకరించాలని సూచించారు. సమావేశంలో నోడల్ అధికారులు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



ఎన్నికల నియమావళిపై వివరిస్తున్న ఎంసీసీ నోడల్ ఆఫీసర్ అల్లా బకాష్

రాయదుర్గం రూరల్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రెగ్యులర్, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ఎంసీసీ నోడల్ ఆఫీసర్ (ఎంపీడీఓ) అల్లా బకాష్ హెచ్చరించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో ఆయన గుమ్మఘట్ట , రాయదుర్గం మండలాల అధికారులతో సమావేశం నిర్వహించారు. వలంటీర్లు, స్టోర్ డీలర్లు, ఉపాధి హామీ , వైకేపీ , ఆశాలు, ఐసీడీఎస్ సిబ్బంది ఎన్నికల ప్రచారంలో పాల్గొనరాదన్నారు. గ్రామాల్లో ఇళ్లకు గాని, ఇళ్లపైన గాని రాజకీయ పార్టీలకు చెందిన ఫొటోలు, జెండాలు ఉండరాదన్నారు. గుమ్మఘట్ట ఎంపీడీఓ గౌరీదేవి, ఏఓ చిక్కన్న, ఈఓపీఆర్డీ రంగనాయకులు, ఎంఈఓ వెంకట రమేష్ , ఏపీఓ దేవరాజు, ఏపీఎంలు జయచంద్ర, కళానాయక్ , ఐసీడీఎస్ సూపర్ వైజర్ ఈశ్వరమ్మ, పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ , హెల్త్, విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

జలం.. పుష్కలం

- రాయదుర్గంలో ముందస్తు ప్రణాళికతో నీటి సరఫరా
- వర్షాకాలంతో సమానంగా రెండు రోజులకోసారి నీరు
- పంప్‌హౌస్ నుంచి రోజూ 14 ఎంఎల్‌డీ నీరు పంపింగ్
- సమ్మర్ స్టోరేజీలో 1670 ఎంఎల్‌డీ నీటి నిల్వ
- 2019 ఎన్నికల ముందు ఐదు రోజులకోసారీ వదలని పరిస్థితి
- వైఎస్సార్ చలువతోనే అందుబాటులోకి ప్రత్యేక పథకం



కణేకల్లు సమ్మర్ స్టోరేజీలో నిల్వ ఉన్న నీరు



పట్టణంలోని ఓహెచ్ఆర్ ట్యాంకు

రాయదుర్గం: అసలే ఎండలు మండుతున్నాయి.. ఉదయం తొమ్మిది గంటలు గడవక ముందే సూరీడు సుర్రుమంటున్నాడు..బోర్లు,బావుల్లో భూగర్భజలాలు అడుగంటుతున్నాయి. దీన్ని దృష్టిలో ఉంచుకొని మున్సిపల్ యంత్రాంగం ముందస్తు చర్యలు చేపట్టింది. సుమారు 75వేలకు పైగా జనాభా ఉన్న రాయదుర్గంలో మండు వేసవిలోనూ రెండు రోజులకోసారి నీరు సరఫరా చేసేందుకు అవసరమైన కార్యాచరణ రూపొందించారు. 2019 ఎన్నికలకు ముందు టీడీపీ హయాంలో పాలకుల నిర్లక్ష్యంతో పట్టణ ప్రజలు తాగునీటి కోసం అల్లాడారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకొచ్చిన తర్వాత అలాంటి సమస్య తలెత్తకుండా పటిష్ట చర్యలు చేపట్టింది. మున్సిపల్ పాలక వర్గం ఎప్పటికప్పుడు ప్రత్యేక శ్రద్ధతో తాగునీరు అందించేలా కృషి చేసింది.

వైఎస్సార్ చలువతోనే శాశ్వత పరిష్కారం..

డాక్టర్ వైఎస్సార్ చలువతోనే పట్టణ ప్రజలకు శాశ్వత తాగునీటి పరిష్కారం లభించింది. 2004కు ముందు అప్పటి ప్రభుత్వం రాయదుర్గం ప్రజల తాగునీటి కష్టాలను పట్టించుకోలేదు. వేసవి వచ్చిందంటే కన్నీటి కష్టాలే కనిపించేవి. ఈ సమస్యను గుర్తించిన వైఎస్సార్.. శాశ్వత పరిష్కారం చూపారు. హెచ్ఎల్‌సీ బోర్డులో 0.2 టీఎంసీ నీటిని తాగునీటి కోసం కేటాయించారు. కణేకల్లు వద్ద సమ్మర్ స్టోరేజీ, నాలుగు పంపు హౌస్‌లు ఏర్పాటుకు రూ.52 కోట్లు కేటాయించారు. సుమారు 27 కిలోమీటర్లు పైపులైన్ ద్వారా డబ్ల్యూటీపీ ట్యాంకుకు నీరు చేర్చి, అక్కడి నుంచి పట్టణంలోని 7 ఓహెచ్ఆర్ ట్యాంకుల ద్వారా సరఫరా చేసేందుకు చర్యలు తీసుకున్నారు. ఈ పథకం పట్టణ ప్రజల దాహార్తి తీరుస్తోంది. ఇలాంటి స్కీమ్‌ను టీడీపీ హయాంలో అటకెక్కించారు. పర్యవేక్షణ లేక పైపులైన్లు ఎక్కడబడితే అక్కడ దెబ్బతిన్నాయి. వైఎస్ జగన్ సీఎం అయిన తర్వాత ఈ పథకం పునరుద్ధరించారు.

నిత్యం 14 ఎంఎల్‌డీ నీరు

సమ్మర్ స్టోరేజీ 3052 ఎంఎల్ (మెగా లీటర్లు) కెపాసిటీ. ప్రస్తుతం 1670 ఎంఎల్‌డీ నీరు నిల్వ ఉంది. మరో నాలుగు నెలల పాటు తాగునీటి సమస్య ఉండదు. నిత్యం 14 ఎంఎల్‌డీ నీరు పట్టణానికి పంపు చేస్తున్నారు. ఆ నీటిని 32 వార్డులకు సమృద్ధిగా అందేలా చర్యలు తీసుకున్నారు. 85 డైరెక్ట్ బోర్‌వెల్ పథకాలు 5 చేతిబోర్లు ఉన్నాయి. 166 పబ్లిక్ కొళాయిలు ఉండగా, 11,289 వ్యక్తిగత కొళాయిలు ఉన్నట్టు రికార్డులు చెప్తున్నాయి.

రాయదుర్గం పట్టణ జనాభాకనుగుణంగా తాగునీటి వనరులు ఇలా..

ప్రాంతం	రాయదుర్గం
మొత్తం వార్డులు	32
పట్టణ జనాభా	75 వేలు
పట్టణానికి నీరందించే పంప్ హౌస్‌లు	03
రోజూ పంపింగ్ చేస్తున్న నీరు	14 ఎంఎల్‌డీ
నీటి వనరుల సంఖ్య	వైఎస్సార్ తాగునీటి పథకం, 85 డైరెక్ట్ బోర్‌వెల్స్, 5 చేతిబోర్లు
పబ్లిక్ కొళాయిల సంఖ్య	166
వ్యక్తిగత కొళాయిల సంఖ్య	11,289

నీటి సమస్య ఉండదు



పట్టణ ప్రజలకు తాగునీరు సరిపడా అందిస్తున్నాం. సమ్మర్ స్టోరేజీ ట్యాంకును ముందుగానే నింపాం. వైఎస్సార్ చలువతో శాశ్వత నీటి పథకానికి మోక్షం లభించింది. 32 వార్డుల ప్రజలు దాహార్తి తీర్చేందుకు వైఎస్సార్ నీటి పథకం ఎంతో ఉపయోగపడుతోంది. వేసవి దృష్ట్యా ముందస్తు ప్రణాళికలు చేపట్టాం.

– పొరాళ్ల శిల్ప, మున్సిపల్ చైర్‌పర్సన్, రాయదుర్గం

రూ.63 లక్షలతో ప్రతిపాదనలు

వేసవిలో నీటి కష్టాలు రానీకుండా చర్యలు చేపట్టాం . ముందు జాగ్రత్తగా బోర్‌వెల్ కోసం రూ.20 లక్షలు, నీటి ట్యాంకర్లతో సరఫరా కోసం రూ.5 లక్షలు, మోటార్ల మరమ్మతుకు రూ.15 లక్షలు, పైపులైన్ లీకేజీ, ఇతర పనులకు రూ.18 లక్షలు మొత్తం రూ.63 లక్షలతో ప్రతిపాదనలు పంపాం. ఎస్ఎస్ ట్యాంకు నుంచి నీరు సరఫరా అయ్యే పైపులైన్‌ను నిరంతరం పర్యవేక్షిస్తున్నాం.



– కిశోర్, మున్సిపల్ కమిషనర్, రాయదుర్గం

సంక్షేమ పాలనకు పట్టం కట్టండి



రామసాగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న విశ్వ, శంకరనారాయణ, పైలా

- చుట్టపు చూపుగా వచ్చే పయ్యావులకు బుద్ధి చెప్పండి
- ప్రచారంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు విశ్వ,శంకరనారాయణ

బెళుగుప్ప: రాష్ట్రంలో సంక్షేమ పాలనకు మరోమారు పట్టం కట్టాలని వైఎస్సార్‌సీపీ ఉరవకొండ ఎమ్మెల్యే అభ్యర్థి వై.విశ్వేశ్వరరెడ్డి , అనంతపురం పార్లమెంట్ అభ్యర్థి శంకరనారాయణ, పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నర్సింగయ్య ప్రజలను కోరారు. శుక్రవారం బెళుగుప్ప మండల పరిధిలోని రామసాగంలో 'ఇంటింటికీ విశ్వన్న' కార్యక్రమంలో భాగంగా ఎన్నికల ప్రచారం చేశారు. తొలిత రామసాగరంలోని బూదిగమ్మ ఆలయంలో నేతలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఇంటింటా ప్రచారాన్ని అభ్యర్థులు ఉత్సాహంగా ప్రారంభించారు. అనంతరం గ్రామ కూడలిలో ప్రచారంలో భాగంగా ప్రజలనుద్దేశించి ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వేశ్వరరెడ్డి, ఎంపీ అభ్యర్థి శంకరనారాయణ, పార్టీ అధ్యక్షుడు పైలా మాట్లాడారు. ఎమ్మెల్యేగా గెలిచిన పయ్యావుల కేశవ్ ఐదేళ్ల పాటు ప్రజలను పట్టించుకోకుండా ఎన్నికలొచ్చాయని, ఎక్కడాలేని ప్రేమను ఒలకబోస్తున్నాడని విమర్శించారు. కేశవ్‌కు పదవిపై కాంక్ష తప్ప ప్రజల బాగోగులు పట్టలేదన్నారు. త్వరలో జరిగే ఎన్నికల్లో కేశవ్‌కు ప్రజలు ఓటు ద్వారా గట్టిగా బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

మంచి జరిగి ఉంటేనే ఓటు వేయండి:

ఈ ఐదేళ్లలో ఎన్నో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒకే ఒక్క మాట ధైర్యంగా చెబుతున్నారని, ప్రజలకు మంచి జరిగి ఉంటేనే ఓటు వేయాలని అడుగుతున్నారని.. మంచి చేశాము కాబట్టే ప్రజల ముందుకు ధైర్యంగా వచ్చి ఓటు వేయమని అడుగుతున్నామని అభ్యర్థులు కోరారు. జెడ్పీటీసీ మమత, ఎంపీపీ పెద్దన్న, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ రామాంజనేయులు, పార్టీ మండల అధ్యక్షులు మచ్చన్న, ఉపాధ్యక్షులు దేవనాథ్‌రెడ్డి, కరుణాకర్, నాయకులు త్రిలోక్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ శ్రీనివాసులు, బెలుగుప్ప, ఆవులెన్న సహకార సంఘాల అధ్యక్షులు శివలింగప్ప, శ్రీనివాసులు, పార్టీ ప్రచార కమిటీ జిల్లా ఉపాధ్యక్షులు నాగిరెడ్డి, ముత్యాల రెడ్డి, సర్పంచ్ రామకృష్ణమ్మ, వీరబొమ్మన్న, గోవిందు రెడ్డి, జయమార్‌రెడ్డి, తిమ్మారెడ్డి, కేశవరెడ్డి, రమేష్, ఉమ్మన్న, దేవి, దొనసింహ, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గెలిపించండి.. అభివృద్ధి చేసి చూపిస్తాం



వారపు సంతలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి తలారి రంగయ్య

- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రంగయ్య

కళ్యాణదుర్గం: త్వరలో జరగబోవు ఎన్నికల్లో నన్ను గెలిపిస్తే కళ్యాణదుర్గం నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసి చూపిస్తామని ఎమ్మెల్యే అభ్యర్థి తలారి రంగయ్య అన్నారు. అనతి కాలంలోనే గ్రామాలకు రోడ్లు నిర్మించామని, వేసవిలో తాగునీటి ఎద్దడి నివారించేందుకు 60 బోర్లు వేయించామన్నారు. శుక్రవారం ఉదయం మార్కెట్ యార్డులోని వారపు సంతలో, సాయంత్రం 19వ వార్డులో నాయకులతో కలిసి ప్రచారం చేశారు. ఎమ్మెల్యే అభ్యర్థి స్థానిక వ్యాపారులు, చిరు వ్యాపారుల ఇళ్ల వద్దకు ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. అతి తక్కువ సమయంలోనే ప్రజలకు మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. బీటీపీ ప్రాజెక్టు ద్వారా 114 చెరువులకు నీరందిస్తామని చెప్పారు. ఆ ప్రక్రియ వైఎస్సార్‌సీపీ మరోసారి అధికారంలోకొస్తేనే జరుగుతుందన్నారు. డబ్బు ఆశ జూపి కొందరు పగటి వేషగాళ్లు ఓట్ల కోసం వస్తారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో కురబ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు దొణస్వామి, పట్టణ కన్వీనర్ గోపారం శ్రీనివాసులు, మున్సిపల్ చైర్మన్ రాజ్‌కుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్ జయం ఫణి, రాష్ట్ర జానపద, నృత్య అకాడమీ చైర్మన్ బాబురెడ్డి, జెడ్పీటీసీ మంజునాథ్, డీసీసీబీ డైరెక్టర్ రామాంజనేయులు, ఆయా వార్డుల కౌన్సిలర్లు లక్ష్మన్న, అర్చన, పరమేశ్వరప్ప, భాగ్యమ్మ సీనియర్ నాయకులు సుధీర్, తిరుమల వెంకటేశులు, గణేష్, గుప్తా, కోఆప్షన్ సభ్యులు అప్జల్, సురేష్, రామాంజనేయులు, సుదర్శన్ రెడ్డి, బాబా, నాగరాజు, రేవన్న గౌడ్, పరంధామరెడ్డి, మల్లికార్జున, శ్రీకాంత్‌రెడ్డి, షేక్షావలి, హేమ, దివ్య నాయకులు శ్రీకాంత్, మారుతి, చరణ్, వంశీ, బిక్కిహరి, జాకీర్, జోసెఫ్ కిశోర్, మల్లన్న, రామిరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు ఎంపీ రంగయ్య పర్యటన

కళ్యాణదుర్గం: పట్టణంలోని 23వ వార్డులో శనివారం ఉదయం 7 గంటలకు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తలారి రంగయ్య పర్యటించనున్నారు. ఈ మేరకు శుక్రవారం పట్టణ కన్వీనర్ గోపారం శ్రీనివాసులు పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఎస్సీ కాలనీలోని వాటర్ ట్యాంక్ నుంచి ప్రచారం ప్రారంభమవుతుందన్నారు.

ఎన్నికలకు మేము సిద్ధం

కళ్యాణదుర్గం: పట్టణంలో ఎన్నికలకు మేము సిద్ధం అంటూ పోలీసులు శుక్రవారం సాయంత్రం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. స్థానిక సర్కిల్ కార్యాలయం నుంచి అంబేడ్కర్ సర్కిల్, టీ సర్కిల్, గాంధీ చౌక్‌లతో పాటు పట్టణంలోని ప్రధాన రహదారులలో కేంద్ర సాయిధ బలగాలతో మార్చ్ నిర్వహించారు. డీఎస్పీ శ్రీనివాసులు నేతృత్వంలో సాగిన మార్చ్‌లో ప్రజలలో మరింత చైతన్యం నింపేలా ఆర్డీఓ డాక్టర్ రాణీ సుస్మిత పాల్గొన్నారు. సీఐలు హరినాథ్, నాగరాజు, చంద్రశేఖర్, ఎస్ఐలు పరుశురాముడు, బీఎస్ఎఫ్ ఇన్‌స్పెక్టర్ దళపతి, సబ్ ఇన్‌స్పెక్టర్లు మనోజ్‌కుమార్, రాజన్ త్యాగి, కుల్దీప్ సింగ్ రాథోడ్, రూరల్, అర్బన్ పోలీసులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో మేలైన దిగుబడి



వరి పంటపై రైతులకు అవగాహన కల్పిస్తున్న డీడీఏ మద్దిలేటి, ఏడీఏ శైలజ

బొమ్మనహాళ్: యాజమాన్య పద్ధతులతో పంటలను పండిస్తే మేలైన దిగుబడి వస్తుందని డీడీఏ మద్దిలేటి, ఏడీఏ శైలజ అన్నారు. శుక్రవారం మండలంలోని శ్రీధరఘట్ట, గోనేహాళ్ గ్రామాల్లో సాగు చేసిన వరి పంటలను పరిశీలించారు. వరి పంటకు సోకిన రోగాలపై రైతులకు తెలియజేశారు. వేసవిలో సాగైన వరి పంటలకు యాజమాన్య పద్ధతిలో సాగు చేస్తే మంచి దిగుబడి వస్తుందని సూచించారు. కార్యక్రమంలో ఏఓ శ్రీనివాసులు, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మద్దానేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.1.05 లక్ష

రాయదుర్గం రూరల్: మండలంలోని మద్దానేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భక్తుల నుంచి హుండీ కానుకల ద్వారా రూ.1.05 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ కమిటీ చైర్మన్ బసవరాజు తెలిపారు. స్థానిక దేవాలయంలో ఇన్‌స్పెక్టర్ బాబు, ఈఓ నరసింహారెడ్డి సమక్షంలో ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం హుండీ ఆదాయాన్ని లెక్కించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు జయన్న, ఆలయ కమిటీ సభ్యులు జీఎం మంజునాథ, శ్రీ కంఠప్ప, ధరణేష్ , టెంకాయల మల్లికార్జునప్ప, అప్పాజి, పృథ్వీచంద్ర, నాగప్ప, శంకరప్ప, ఉలుగప్ప పాల్గొన్నారు.

చెరువులన్నింటికీ నీరు ఇవ్వడానికి కృషి

ఉరవకొండ: రాయలసీమలోని చెరువులన్నింటికీ నీరు ఇవ్వడానికి ప్రభుత్వం కృషి చేసిందని వైఎస్సార్‌సీపీ ఐటీ విభాగం జిల్లా అధ్యక్షుడు వై.రాజశేఖర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఐటీ విభాగం జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి మాట్లాడారు. వైఎస్సార్, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నీటి విలువ తెలిసిన ముఖ్యమంత్రులు అన్నారు. రాయలసీమ వ్యాప్తంగా ఉన్న చెరువుల్లో హంద్రీనీవా జలాలు నింపేలా ప్రభుత్వం చెరువులను పూర్తి చేశారన్నారు. ఇప్పటికే హంద్రీనీవా ద్వారా కర్నూలు, అనంతపురం జిల్లాలోని చెరువులకు నీటిని మళ్లించి భూగర్భజలాలు పెంపొందించేలా ప్రభుత్వం కృషి చేసిందన్నారు. శ్రీశైలం నుంచి కుప్పం వరుకు హంద్రీనీవా పూర్తి చేసి ఈఏడాది ట్రయల్ ద్వారా విజయవంతంగా నీటిని తీసుకెళ్లారన్నారు. కార్యక్రమంలో ఐటీ విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు సత్యంరెడ్డి, పురుషోత్తం, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ జల దినోత్సవం

కళ్యాణదుర్గం రూరల్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రపంచ నీటి (జల) దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ జరాంరెడ్డి మాట్లాడుతూ నీరు అనేది లేకపోతే మనం బతకడం కష్టం అని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎంవీ శేషయ్య, డాక్టర్ కోనంకి శ్రీధర్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏపీ సెపక్‌తక్రా జట్లకు శిక్షణ ప్రారంభం



క్రీడాకారులకు తర్ఫీదు ఇస్తున్న సీనియర్ కోచ్‌లు

ఉరవకొండ: స్థానిక పోలీసు క్రీడా మైదానంలో ఆంధ్రప్రదేశ్ సెపక్‌తక్రా బాలబాలికల సబ్ జూనియర్ జట్లకు శిక్షణ శుక్రవారం ప్రారంభమైంది. శిక్షణ శిబిరాన్ని సెపక్‌తక్రా క్రీడా సంఘం చైర్మన్ సప్తగిరి మల్లికార్జున, సంఘం అధ్యక్షులు షాహీన్ ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాలకు చెందిన 50 మంది క్రీడాకారులు ఈ శిబిరంలో పాల్గొన్నారు. శిక్షణ శిబిరంలో అంతర్జాతీయ క్రీడాకారులైన కర్నూలుకు చెందిన అశోక్, శివ, ప్రకాశం జిల్లాకు చెందిన మధు, సెపక్‌తక్రా కోచ్ శ్రీనివాసులు, ఉరవకొండ సీనియర్ పీడీ మారుతీ క్రీడాకారులకు శిక్షణ ఇచ్చారు. క్రీడాసంఘం చైర్మన్ సప్తగిరి మల్లికార్జున క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈల 25 వరకు క్రీడాకారులకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. 26 నుంచి 30 వరకు కర్ణాటకలోని ధావనగిరిలో జరగనున్న జాతీయస్థాయి సెపక్‌తక్రా పోటీల్లో పాల్గొంటారన్నారు.

నేటి నుంచి భంభం బాబా ఉరుసు



ఆశ్రమంలో సద్గురు భంభంబాబా జీవసమాధి

రాయదుర్గంటౌన్: పట్టణంలోని సద్గురు భంభంబాబా ఉరుసు ఈనెల 23 నుంచి ప్రారంభం కానుంది. మహాయోగి భంషేక్ అబ్దుల్ వాహబ్ స్వామి ఉరుసు మూడు రోజుల పాటు జరుగుతుందని ఆశ్రమ నిర్వాహకులు బషీర్ అహ్మద్, అబ్దుల్ వాహబ్ తెలిపారు. శనివారం స్వామి సందల్ ముబారక్ (గంధము) ఉత్సవం జరుపుకోనున్నారు. 24న స్వామి చిత్రపటం ఊరేగింపు, సాయంత్రం దర్గాలో చిరాఖేన్ (దీపారాధన), 25న షంషీర్ (బ్రహ్మోత్సవం), జియారత్, పొర్లమి, గురుపూజ పీఠాధిపతులతో ఆధ్యాత్మిక ఉపన్యాసం ఉంటుందన్నారు.

శుభకార్యం

వజ్రకరూరు: స్థానిక టీటీడీ కళ్యాణ మండపంలో గ్రామానికి చెందిన బోయమధు, కర్నూల్ జిల్లా మద్దికెరకు చెందిన సంధ్యల వివాహం శుక్రవారం జరిగింది. ఈ వేడుకకు వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్ వై.ప్రణయ్‌కుమార్‌రెడ్డి హాజరయ్యారు. నూతన వధూవరులను ఆశీర్వదించారు.

పశువుల పెంపకందారుల ఆందోళన

కూడేరు: మండల కేంద్రంలోని పాడి రైతులు పశువులకు వైద్య సేవలు సక్రమంగా అందించలేదని స్థానిక పశువైద్యశాల ఎదుట శుక్రవారం ఆందోళన చేశారు. సిబ్బందిని లోపలికి వెళ్లనీకుండా గేటు వద్దే అడ్డుకున్నారు. పోలీసులు వచ్చి సర్దిచెప్పినా వినలేదు. వారు మాట్లాడుతూ పశువైద్యాధికారి అందుబాటులో ఉండడని, మందు బయట తెచ్చుకోవాలని చెప్తారని అన్నారు. తర్వాత పశు వైద్యాధికారి శ్రీనివాసులు రాగా, మధ్యాహ్నానికే ఇంటికి వెళ్తే రోగాల బారినపడిన పశువుల పరిస్థితి ఏమిటని నిలదీశారు. డాక్టర్ అందుబాటులో ఉండరని జేడీకి ఫోన్ ద్వారా తెలియజేశారు.

సంక్షిప్త సమాచారం

81 మంది విద్యార్థుల గైర్హాజరు

కూడేరు: మండలంలో శుక్రవారం జరిగిన గణితం పరీక్షకు మొత్తం 497 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, 81 మంది గైర్హాజరయ్యారు. కూడేరు హైస్కూల్ కేంద్రంలో 323 మందికిగాను 46 మంది, కేజీబీవీ కేంద్రంలో 174 మందికిగాను 35 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఎంఈఓ చంద్రశేఖర్ తెలిపారు.పరీక్షల చీఫ్ అధికారులు దిలీప్ కుమార్, తిమ్మప్ప, డిపార్టమెంటల్ అధికారులు నరహరి, రాఘవేంద్ర పరీక్ష కేంద్రాలను పర్యవేక్షించారు.

నేడు అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

ఉరవకొండ: స్థానిక మూడో వార్డు జోగప్పబావి వీధిలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ నూతన విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు యువజన సంఘం నాయకులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అన్ని మండలాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చి, అంబేడ్కర్ విగ్రహావిష్కరణను విజయవంతం చేయాలని కోరారు.

ఆర్థిక సాయం

శెట్టూరు: ములకలేడుకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు మారెప్ప(44) అనారోగ్యంతో శుక్రవారం మృతిచెందాడు. మృతుడి కుటుంబానికి ఎంపీ తలారి రంగయ్య రూ.10వేల నగదు నాయకుల ద్వారా అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగరాజు, నాయకులు ఎమ్మెస్ రాయుడు, హరినాథరెడ్డి, వీరాంజనేయులు, రామాంజనేయులు, సంధ్యారాణి, శ్రీనివాసులు, రాజన్న, నాగభూషణం, రామాంజి, శివమూర్తి, ఈరన్న, బాబు, వన్నూరుస్వామి పాల్గొన్నారు.

మద్యం విక్రేత అరెస్ట్

వజ్రకరూరు: మండలంలోని కమలపాడు తండాకు చెందిన మద్యం విక్రేత సూరిని అరెస్ట్ చేసి, అతని నుంచి పది మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ నరేష్ శుక్రవారం తెలిపారు.

బొలెరో వాహనం సీజ్ : మండలంలోని పొట్టిపాడు క్రాస్ వద్ద శుక్రవారం సాయంత్రం అధికలోడుతో వెళ్తున్న బొలెరో వాహనాన్ని సీజ్ చేసి, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు.

ఎక్సైజ్ సీఐపై ఆర్‌ఓకు ఫిర్యాదు

ఉరవకొండ: ఎక్సైజ్ సీఐ కిశోర్‌కుమార్, సిబ్బంది కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జేసీ కేతన్‌గార్గ్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జ్ కేవీ రమణ శుక్రవారం తెలిపారు.పట్టణంలోని లత్తవరం రోడ్డులోని ప్రభుత్వ మద్యం దుకాణంలో మద్యం కొనుగోలు చేసిన వినియోగదారులను ఎక్సైజ్ సీఐ, సిబ్బంది వంద మీటర్లు దాటగానే వారి సిబ్బందితో అరెస్టు చేయించి, పోలీసు స్టేషన్‌లోనే సాయంత్రం వరుకు కూర్చోబెట్టి అక్రమ కేసులు పెడుతున్నారని తెలిపారు. ఒక్క బాటిల్ కొనుగోలు చేసినా సీఐ, సిబ్బంది అరెస్టు చేయడం, జరిమానా విధించడం సరికాదన్నారు.

ఆటో బోల్తాపడి నలుగురికి గాయాలు

కంబదూరు: మండలంలోని కురాకులపల్లి సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు మహిళలు గాయపడ్డారు.కురాకులపల్లికి చెందిన ముత్యాలమ్మ, లక్ష్మమ్మ, నాగమణి, గంగమ్మ కంబదూరుకు వెళ్లి తిరిగి సొంతూరుకు వెళ్తుండగా ఆటో అదుపు తప్పింది. అందులో ప్రయాణిస్తున్న నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. వారిని కళ్యాణదుర్గం ఆస్పత్రి నుంచి మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్డీటీపై కక్ష సాధింపు చర్యలు మానుకోవాలి

గుమ్మఘట్ట: ఆర్డీటీపై కేంద్ర ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బీటీపీ గోవిందు, వ్యవసాయ కమిటీ మార్కెట్ యార్డ్ మాజీ డైరెక్టర్ బేలోడు రామాంజనేయులు, ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు కేఎం రాజు అన్నారు. శుక్రవారం వారు బడుగు, బలహీన వర్గాలు, నిరుపేదల ఆశాజ్యోతి ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ స్థాపించిన ఆర్డీటీపై కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని ఖండించారు. ఇండేన్ గ్యాస్ మేనేజర్ గ్యాస్ కృష్ణ, ఉలిగప్ప, గోవిందప్ప, బీటీపీ హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

సెబ్ స్టేషన్ తనిఖీ

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని సెబ్ స్టేషన్‌ను శుక్రవారం డిప్యూటీ కమిషనర్ విజయ్‌శేఖర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. అక్రమ కేసుల్లో పట్టుపడిన వాహనాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కర్ణాటక మద్యాన్ని అరికట్టాలని సూచించారు. కార్యక్రమంలో సెబ్ సీఐ వెంకట్ సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి లక్ష్మీనరసింహస్వామి ఉత్సవం

బొమ్మనహాళ్: మండలంలోని ఉప్పరహాళ్‌లో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఉత్సవం శనివారం నుంచి నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు తెలిపారు. ఏటా మాఘమాసంలో ఉత్సవాలు ఉద్దేహాళ్ వద్ద వేదావతి నదిలో, అనంతరం ఉప్పరహాళ్ ఆలయం వద్ద జరుగుతాయన్నారు. ఉద్దేహాళ్, ఉప్పరహాళ్ గ్రామస్తులు ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే ఉపేక్షించేదిలేదు

వజ్రకరూరు: ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే ఉపేక్షించేదిలేదని తహసీల్దార్ మహమ్మద్ రఫీ అన్నారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రేషన్ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఎన్నికల నియమావళిని తప్పక పాటించాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు నిబంధనలు పక్కాగా అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో సీఎస్‌డీటీ సుబ్బ లక్ష్మి పాల్గొన్నారు.